



వాయిదా విషయాన్ని తెలియ జేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, డీఈఓ ప్రసాద్‌బాబు



అమరావతికి వెళ్లడానికి పీవీకేకే కళాశాలకు చేరుకున్న డీఎస్సీలో ఎంపికైనవారు, వారి కుటుంబ సభ్యులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

- చినుకుల్లోనూ అనంతకు డీఎస్సీలో ఎంపికైనవారు
- అధికారులతో కలిసి ఆనందంగా అల్పాహారం
- వర్షాలతో నియామక పత్రాల పంపిణీ సభ రద్దు
- అమరావతి పర్యటన వాయిదా
- కాబోయే గురువులకు నిరాశ

అనంతపురం విద్య, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉద్యోగార్థులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. మెగా డీఎస్సీ-2025ని నిర్వహించింది. వేల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చింది. వారి జీవితాల్లో వెలుగులు నింపింది. ఉద్యోగం వచ్చిన ఆనందంలో ఉన్న వారికి నియామక పత్రాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అమరావతిలో అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ఎంపికైన సంతోషపడ్డారు. ఆ క్షణం కోసం ఎదురుచూస్తున్నారు. గురువారం ఉదయం అనంతపురం నగర (మిగతా 6లో...)

సమయానికి ఇస్తారా..!

పప్పు శనగ సాగుకు రైతులు సిద్ధం

సబ్సిడీ విత్తనం కోసం ఎదురు చూపులు

పాత బకాయిలపై సరఫరాదారుల పేచీ

టెండరు ప్రక్రియ పూర్తయ్యేది ఎన్నడు..?

పప్పుశనగ రైతుకు విత్తన దిగులు పట్టుకుంది. వరుస వర్షాలు రబీ సీజన్‌పై ఆశలు రేపుతున్నాయి. అన్నదాతలు పొలాలను దున్ని సిద్ధంగా ఉంచారు. అక్టోబరులో తొలి వర్షం కురవగానే విత్తనం వేస్తామని అంటున్నారు. కానీ విత్తన సరఫరా టెండర్లు ఇంకా ఖరారు కాలేదు. పాత బకాయిలు చెల్లిస్తేనే అగ్రిమెంట్‌కు వస్తామని సరఫరాదారులు పేచీ పెడుతున్నారు. జిల్లాలో గత ఏడాది 72 వేల హెక్టార్లలో పప్పు శనగ సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ 50 వేల హెక్టార్లకు పరిమితమైంది. ఈ ఏడాది 50 వేల నుంచి 60 వేల హెక్టార్లలో పప్పు శనగ సాగయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో విత్తనాలను అందిస్తే.. రైతులకు మేలు జరుగుతుంది.



పుట్లూరు మండలం గాండ్లపాడులో పప్పు శనగ సాగుకు సిద్ధంగా ఉన్న పొలం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అక్టోబరు ఒకటో తేదీ నుంచి రబీ సీజన్ మొదలవుతుంది. అంటే.. మరో 12 రోజులే గడువు ఉంది. ఈ సీజన్‌లో జిల్లాలోని నల్లరేగడి భూముల్లో పప్పుశనగ పంటను రైతులు సాగు చేస్తారు. ఆగస్టు నుంచి జిల్లాలో వరుసగా వర్షాలు కురుస్తున్నాయి. రబీ సాగు కోసం నల్లరేగడి భూములను ఇప్పటికే రైతులు సిద్ధం చేసుకున్నారు. సీజన్ మొదలై.. ఒక్క వర్షం కురిస్తే చాలు పప్పుశనగ విత్తనం వేస్తారు. రబీ సాగు కోసం ఏటా ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు పప్పుశనగ విత్తనాలను ఇస్తోంది. కానీ ఈ సారి జాప్యం జరిగేలా ఉంది. రాష్ట్ర స్థాయిలో పప్పుశనగ సరఫరా కోసం టెండర్ల ఖరారు ఇంకా పూర్తి కాలేదు. గత ఏడాది ఇదే సమయానికి టెండర్లు ఖరారు చేశారు. సెప్టెంబరు చివరి వారంలో సబ్సిడీ ధరలను ఖరారు చేశారు. అక్టోబరు మొదటి వారంలో పప్పుశనగ విత్తన పంపిణీ ప్రారంభించారు. కానీ ఈ ఏడాది టెండరు ప్రక్రియ ఎప్పుడు పూర్తి అవుతుందో తెలియడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పప్పు శనగ

బకాయిలే సమస్య

రబీ సీజన్‌లో పప్పుశనగ విత్తనాల సరఫరా కోసం ఆగస్టు 13న ఈ-టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ నెల 25వ తేదీ వరకూ టెండర్ల దాఖలుకు అవకాశం కల్పించారు. రాష్ట్రస్థాయిలో 12 మంది, ఉమ్మడి జిల్లాకు సంబంధించి నలుగురు విత్తన సరఫరాదారులు టెండర్లు దాఖలు చేసినట్లు సమాచారం. గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 16 మంది విత్తన సరఫరాదారులు టెండర్లు దాఖలు చేశారు. గత ఏడాది రబీ సీజన్‌లో పప్పుశనగ, ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ విత్తన సరఫరాకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో రూ.70 కోట్లు బకాయిలు ఉన్నాయి. అందుకే ఈ సారి తక్కువ మంది విత్తన సరఫరాకు టెండర్లు వేశారని అంటున్నారు. టెండర్లు వేసిన విత్తన సరఫరాదారులతో రాష్ట్ర స్థాయి అధికారులు ఈ నెల మొదటి వారంలో ఒకసారి, ఇటీవల రెండోసారి చర్చలు జరిపారు. బకాయిలు చెల్లిస్తేనే విత్తన సరఫరాకు అగ్రిమెంట్ చేసుకుంటామని సరఫరాదారులు ఖరాకండిగా చెప్పినట్లు సమాచారం. మరో వారంలో బకాయిలు చెల్లిస్తామని, అగ్రిమెంట్ చేసుకోవాలని అధికారులు కోరినా ససేమిరా అన్నట్లు తెలిసింది.

రబీపైనే రైతుల ఆశలు

ఖరీఫ్‌లో వర్షాలు సరిగా కురవలేదు. పంటలు ఆశాజనకంగా లేవు. గత నెల నుంచి కురుస్తున్న వరుస వర్షాలు రబీపై ఆశలను పెంచాయి. ప్రభుత్వం సకాలంలో పప్పు శనగ విత్తనాలను సరఫరా చేస్తే తమకు మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. రబీ సీజన్ ఆరంభంలో పదును వర్షం పడితే పప్పుశనగ విత్తుతామని అంటున్నారు. చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వం సబ్సిడీపై అందించే పప్పుశనగ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడాది తరహాలోనే ఈ సారి కూడా సకాలంలో విత్తన పంపిణీ చేపట్టాలని కోరుతున్నారు.

సకాలంలో ఇస్తాం..

పప్పుశనగ పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రబీ సీజన్‌కు సకాలంలో పప్పు శనగ విత్తనం అందేలా చూస్తాం. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పప్పు శనగ విత్తన సరఫరా కోసం టెండర్లు పిలిచారు. విత్తన సరఫరాదారులతో చర్చలు జరుపుతున్నారు. త్వరలోనే సబ్సిడీ ధరలు ఖరారయ్యే అవకాశం ఉంది.

- సుబ్బయ్య, ఏపీసీడ్స్ జిల్లా మేనేజర్

అధ్యక్షా..!



అసెంబ్లీ సమావేశాల్లో తొలిరోజే మంత్రి సత్యకుమార్ యాదవ్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి తమ గళం వినిపించారు. వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి మంత్రి వివరించారు. ఉమ్మడి జిల్లాలో కీలకమైన ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ అంశాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ, తెలంగాణలో ఆర్డీటీ అందిస్తున్న సేవలను వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏని రెన్యువల్ చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. (వివరాలు 7లో..)



టమోటా కిలో రూ.18



అనంతపురం రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మండీలో గురువారం కిలో టమోటాలు గరిష్ఠంగా రూ.18తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.10, సరాసరి ధర రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1800 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ, అనుబంధ రంగాల అధికారులు.. రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న పథకాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అవసరం ఉన్న వారికి యూరియా తప్పక పంపిణీ చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికలు రోజూ అందించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఆయిల్ పామ్ తోటల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలనీ, వీలైనంత వరకు ఒకే గ్రామంలో పంట పెట్టేలా చూడాలన్నారు. జిల్లాలో చేపల ఉత్పత్తి మరింత పెరగాలన్నారు. జిల్లాలో 58 పీఏసీఎస్‌లకు సీడ్, ఫర్టిలైజర్ లైసెన్సులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, మార్కెటింగ్ ఏడీ రాఘవేంద్ర, డీసీఓ అరుణకుమారి, సెరికల్చర్ ఏడీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపరచుకోవాలి..

అధికారులు పనితీరు మెరుగుపరచుకుని సత్ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు చెందిన అధికారులతో పనితీరుపై సమీక్షించారు. తొలుత పరిశ్రమల శాఖపై చర్చించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలనీ, పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని ఆదేశించారు. భారీ పరిశ్రమల కోసం స్థల సేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. గనులు, భూగర్భజల వనరుల శాఖపై ఆరాతీశారు. ఇసుక లభ్యతపై సమీక్షించారు. కొత్త గనుల మంజూరు విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిరుజల్లులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం చిరుజల్లులు పడ్డాయి. అనంతపురం, పుట్లూరు, యాడికి, శింగనమల, విడపనకల్లు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. బుధవారం రాత్రి అనంతపురం, యల్లనూరులో జల్లులు కురిశాయి.

గుత్తి డిపో అభివృద్ధికి రూ.4 కోట్లు

స్త్రీ శక్తి పథకం అత్యద్భుత విజయం

1,500 కొత్త బస్సులు కొనుగోలు చేస్తాం

రెండు నెలల్లో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



గుత్తి ఆర్టీసీ బస్టాండులో సమస్యలు తెలుసుకుంటున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

గుంతకల్లు/గుత్తి/ఉరవకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుత్తి బస్టాండు, డిపో అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరు చేస్తామని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ ఆర్టీసీ బస్టాండ్‌లు, డిపోలను ఆయన గురువారం సందర్శించారు. ఆర్టీసీ రాయలసీమ జోన్ చైర్మన్ పూల నాగరాజు, కడప జోన్ ఈడీ చంద్రశేఖర్, ఈడీఈ చంగలరెడ్డి, డీపీటీఓ శ్రీలక్ష్మి, డీఎం గంగాధర్ తదితరులు ఆయనకు ఆహ్వానం పలికారు. గుంతకల్లు, ఉరవకొండలో కార్మికుల సమావేశం నిర్వహించారు. బస్సుల్లో ప్రయాణించే మహిళలతో మాట్లాడారు. స్త్రీ శక్తి పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఉచిత బస్సు పథకం విజయవంతం వెనుక ఆర్టీసీ కార్మికుల శ్రమ ఉందని అన్నారు. కార్మికులు జీరో బ్రేక్ డౌన్ రికార్డు సాధించాలని సూచించారు. పెరిగిన ఆర్టీసీ ఆక్యుపెన్సీకి తగినట్లుగా కొత్త బస్సు సర్వీసులను ప్రారంభిస్తామని అన్నారు. సీఎం ఆదేశాల మేరకు మరో 1,500 బస్సులను కొనేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సులు 1,050 మంజూరయ్యాయని, మరో రెండు నెలల్లో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తెలంగాణ, కర్ణాటకలో ఉచిత బస్సు పథకాలు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయని, అక్కడి వైఫల్యాలను ఏపీలో అధిగమిస్తూ సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. రోజుకు 40 లక్షల మంది ఆర్టీసీ బస్సులలో ప్రయాణిస్తున్నారని, వీరిలో 25 లక్షల మంది మహిళలు, యువతులు, బాలికలే ఉన్నారని అన్నారు.

హక్కుల సాధనకు ఆశాలు పోరాడాలి

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు ఆశావర్కర్లు సమైక్యంగా పోరాడాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. సీఐటీయూ అనుబంధ ఆశావర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన ఆ యూనియన్ జిల్లా మహాసభలకు గేయానంద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధానాలను అమలు చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలే మార్గమన్నారు. ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ... ఆశావర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్, వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు అమలు చేయడంతోపాటు వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఉపాధ్యక్షుడు మన్నీల రామాంజనేయులు పాల్గొన్నారు.

- మహాసభల్లో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా మాలతి, ప్రధాన కార్యదర్శిగా నాగమణి, కోశాధికారిగా భారతి, ఉపాధ్యక్షులుగా సుజాత, ప్రమీల, వరలక్ష్మి, భాగ్యమ్మ, పద్మావతిని ఎన్నుకున్నారు.

ఓపికకు పరీక్ష

- వైద్య పరీక్షల కోసం గంటలు, రోజుల వెయిటింగ్
- అల్ట్రా సౌండ్, ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్‌లకు క్యూ
- స్కానింగ్‌కు తేదీలు నిర్ణయిస్తున్న వైద్య సిబ్బంది
- తిరగలేకపోతున్నామంటున్న బాధితులు (7లో)

రాయదుర్గం, కుందుర్పికి కొత్త ఎంఈఓలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండుమండలాలకు కొత్త ఎంఈఓలను నియమించారు. రాయదుర్గం ఎంఈఓ-1గా పని చేస్తున్న నాగమణి గత నెలలో రిటైర్డ్ అయ్యారు. కుందుర్పి మండలం ఎంఈఓ-1 శంకరన్న తన వ్యక్తిగత కారణాలతో ఆ ఉద్యోగం చేయలేనని తప్పుకున్నారు. దీంతో రాయదుర్గం ఎంఈఓ-1గా అనంతపురం న్యూటౌన్ ఉర్దూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సోషియల్ స్కూల్ అసిస్టెంట్ మహమ్మద్‌ఇర్షాద్‌ను నియమించారు. కుందుర్పి ఎంఈఓ-1గా అనంతపురం కేఎస్ఆర్ బాలికల ఉన్నతపాఠశాలలో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవిని నియమిస్తూ ఆర్జేడీ శామ్యూల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పెద్దాస్పత్రిలో జూడాపై అత్యాచారయత్నం

మూడురోజుల కిందట ఘటన

(వివరాలు మెయిన్‌లో..)

మట్టించుకుందాం..!

● భూసార పరీక్షలతో ఎన్నో ప్రయోజనాలు ● వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు ● తగ్గనున్న సాగు ఖర్చులు



కొత్తచెరువు మండలం బైరాపురం వద్ద మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

కొత్తచెరువు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) కొందరు రైతులు అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశంతో పరిమితికి మించి రసాయన ఎరువులు వాడుతున్నారు. పంటలకు అవసరం లేకున్నా ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో దిగుబడులు రాకపోగా.. వ్యవసాయ భూమి నిస్సారంగా మారుతోంది. చౌడు భూములుగా మారే అవకాశం లేకపోలేదని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే భూసార పరీక్షలు ఒక్కటే మార్గమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పంటలు పండాలంటే నేలలో ఖనిజ లవణాలు, పోషకాలు సమృద్ధిగా ఉండాలి. దీనిపై రైతులు దృష్టి పెట్టకుండా అధిక దిగుబడులు సాధించాలన్న ఆశతో కొందరు రసాయన ఎరువులను భారీగా వినియోగిస్తున్నారు. దీంతో భూమి సమతుల్యత దెబ్బతింటోంది. ఈ కారణంగా మొక్కకు సరైన పోషకాలు అందక పంట దిగుబడిపై ప్రభావం పడుతోందని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. తద్వారా పంటలు పండక రైతులు నష్టపోతున్నారు. ఈ సమస్యల నుంచి రైతులు బయటపడాలన్నా... అధిక దిగుబడులు సాధించాలన్నా మట్టి, నీటి నమూనా పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మట్టి పరీక్షల ఫలితాల ప్రకారం పంటలు సాగుచేస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చంటున్నారు. ఎరువుల వినియోగం తగ్గుతుందనీ, తద్వారా రైతుకు పెట్టుబడి ఖర్చు ఆదా అవుతుందన్నారు.

భూసార పరీక్షలే కీలకం

భూసార పరీక్షల ద్వారా భూమిలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం ఇతర మూలకాలను గుర్తించవచ్చు. సూక్ష్మ పోషకాల లోపాలు కూడా తెలుస్తాయి. భూమిలో పోషకాల హెచ్చుతగ్గులను తెలుసుకోవచ్చు. మట్టి పరీక్షల వల్ల ఆమ్ల, క్షార లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, భాస్వరం, పొటాషియం ఎంత నిష్పత్తిలో ఉన్నాయో తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో పంట వయసు కాలాన్ని బట్టి ఏ ఎరువులను ఎంత మోతాదులో వాడాలో తెలుస్తుంది. దీని ఆధారంగా నేలలో ఏ పంట వేస్తే అధిక దిగుబడి వస్తుందో తెసుసుకునే అవకాశం ఉంటుంది.

అధిక రసాయన ఎరువులతో నష్టాలు

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశంతో రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. అలా చేస్తే భూమిలోని పోషకాలు నశించిపోతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయినా రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించడంలేదు. అధిక మోతాదులో పొటాషియం వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి పోషకాలు మొక్కలకు అందకుండా పోతాయి. జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి, దిగుబడులపై ప్రభావం చూపుతుంది.సూక్ష్మ పోషకాలతోపాటు నైట్రోజన్, సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి సహజ స్వభావాన్ని కోల్పోతుంది. అపుడు భూమిలోకి ఎన్ని ఎరువులు వేసినా గ్రహించక నిస్సారమవుతుంది. ఈ కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

అటకెక్కించిన వైసీపీ

తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ పాలకులు... అన్నదాత సంక్షేమాన్ని అస్సలు పట్టించుకోలేదనడానికి భూసార పరీక్షలే నిదర్శనం. ఐదేళ్లు పూర్తిగా అటకెక్కించారు. దీంతో రైతులు.. ప్రైవేటుగా భూసార పరీక్షలు చేయించుకోవాల్సి వచ్చిందని పలువురు రైతులు వాపోతున్నారు. కూటమి అధికాంలోకి రాగానే రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లతోపాటు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తూ.. భూసార పరీక్షలు నిర్వహిస్తోందని రైతులు వాపోతున్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో 2022 నుంచి 2025 వరకు చేసిన భూసార పరీక్షల వివరాలు..

సంవత్సరం	సేకరించిన నమూనాలు	పంపిణీ చేసిన సాయిల్ కార్డులు
2022-23	00	00
2023-24	00	00
2024-25	17,200	17,200
2025-26	23,159	00

మట్టి సేకరించాలిలా..

● మట్టి పరీక్షలు చేయించుకునే రైతులు కొన్ని పద్ధతులు పాటించాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు.

● పొలం అంతా ఒకే విధంగా ఉంటే రెండు,మూడెకరాల్లో 8 నుంచి 10 చోట్ల (ఇంగ్లిషు అక్షరం) వీ ఆకారంలో 6 నుంచి 7 అంగుళాల గుంత తీసి పై నుంచి కిందకు, అంచుల నుంచి మట్టిని సేకరించాల్సి ఉంటుంది.



● మట్టిలో పంట వేర్లు, ఆకులు లేకుండా చూసుకోవాలి.

● పండ్ల తోటలకైతే 3 నుంచి 4 అడుగుల వరకు గుంత తీసి అంచుల నుంచి ప్రతి అడుగుకు వేర్వేరుగా మట్టిని సేకరించాల్సి ఉంటుంది.

● మట్టి నమూనా సేకరించేటపుడు గట్ల వద్ద, నీరు నిల్వ ఉన్న చోట, రసాయన ఎరువులు వేసి ఉండుంటే 50 నుంచి 60 రోజుల వరకు మట్టిని సేకరించకుడదు.

● సేకరించిన మట్టి మొత్తాన్ని ఒక పట్టపై పోసి నాలుగు సమ భాగాలుగా చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎదురెదురు భాగాలను తీసేయాలి. మిగిలిన మట్టిలో అర కిలో మట్టిని ప్లాస్టిక్ కవర్‌లో తీసుకుని, రైతు చిరునామా, ఫోన్ నంబర్, పంట వివరాలను రాసి పరీక్షా కేంద్రంలో అందజేయాల్సి ఉంటుంది.

దిగుబడి తగ్గుతోంది



నాకు మూడెకరాల పొలం ఉంది. గతేడాది అధికారులు పొలంలో భూసార పరీక్షల పేరుతో మట్టి తీసుకెళ్లారు. వాటిని పరీక్షించి, ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడాలి, ఏ పంట సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయన్న విషయాలు తెలియజేయలేదు.దీంతో పంటలకు అధికంగా ఎరువులు వాడడం వల్ల ఖర్చు పెరుగుతోంది. పంటల దిగుబడి కూడా తగ్గుతోంది. ఇప్పటికైనా అధికారులు భూసార పరీక్షలు నిర్వహించి, సూచనలు ఇవ్వాలి.

-కోనప్ప, రైతు, కొత్తచెరువు

మట్టి పరీక్షల కోసం అనంతపురం వెళ్లాల్సి వస్తోంది



మామిడి, చీనీ పంటలు సాగుచేయాలనుకుంటున్నా. భూసార పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. ధర్మవరం, పెనుకొండలో ఉన్న కేంద్రాల్లో భూసార పరీక్షలు చేయలేదు. దీంతో అనంతపురం వెళ్లాల్సి వస్తోంది. గత ప్రభుత్వం వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను కొత్తచెరువులో ఏర్పాటు చేసింది. ల్యాబ్ నిర్మించిందే తప్ప.. సేవలు మాత్రం అందుబాటులోకి రాలేదు.

- మధు, రైతు, కొత్తచెరువు

ఆటోడ్రైవర్లకు పండుగ

రూ.15వేల ఆర్థికసాయం ప్రకటించిన ప్రభుత్వం

అక్టోబరు 2న బ్యాంకు ఖాతాల్లోకి జమ

హర్షం వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు





మార్కెట్‌లో పార్కింగ్ చేసిన ఆటోలు



ధర్మవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ ఆటో డ్రైవర్ల కుటుంబాల్లో నూతన సంతోషం నింపనుంది. అర్హులైన ఆటో డ్రైవర్ల బ్యాంకు ఖాతాలో అక్టోబరు 2న విజయదశమి రోజు రూ.15వేలు జమ చేయనున్నట్లు సీఎం చంద్రబాబు ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది జిల్లాలో వేల సంఖ్యలో ఉన్న ఆటో డ్రైవర్లకు ఎంతో భరోసాను కల్పించే విషయం. వీరికి దసరా కానుకగా రూ.15 వేలు అందనున్నాయి. వైసీపీ పాలనలో అనేక ఆంక్షలతో ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేలు అందించారు. అయితే ఆటో కార్మికుల అకౌంట్లలో రూ.10వేలు జమచేసిన కొన్ని రోజులకే అప్పటి ప్రభుత్వం ఆర్టీఓలను రంగంలోకి దించి, చలానాలు, రవాణాశాఖ నిబంధనల పేరుతో రకరకాలుగా జరిమానాలు విధించి, చేసిన సాయం కంటే ఎక్కువగా లాగేశారని ఆటో డ్రైవర్లు గుర్తు చేసుకుంటున్నారు.

ఎవరికి వర్తిస్తుందంటే...

సొంత వాహనం కలిగి, దాన్ని నడిపే డ్రైవర్లకు ఈ పథకం వర్తిస్తుంది. జిల్లాలో ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఏడువేల మంది ఉన్నారు. ఇటీవల వీరి సంఖ్య పెరిగి ఉంటుందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ సారి 10వేల మందికిపైగా సాయం అందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం అందజేసే ఆర్థిక సాయం వాహన బీమా, టైర్ల మార్పులు, ఇంధన ఖర్చులు, కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుందని ఆటో డ్రైవర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హరిత పన్ను తగ్గింపు

ప్రజలను ఎడాపెడా పన్నులతో బాదేయడమే పనిగా పెట్టుకున్న గత వైసీపీ ప్రభుత్వం ఏటా వాహనదారుల నుంచి రూ.కోట్లలో పిండేసింది. హరితపన్ను పేరుతో రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. వాహనం రిజిస్ట్రేషన్ చేసిన నాటి నుంచి ఏడేళ్లు దాటితే వాటి నుంచి హరిత పన్ను పేరుతో రూ.200 వరకు మాత్రమే కట్టించుకునేవారు. జగన్ ప్రభుత్వం మాత్రం 2022 జనవరి 1 నుంచి వివిధ స్లాబ్‌లుగా విడదీసి పన్నులు విధించింది. ఏడు నుంచి పదేళ్లయితే సగం త్రైమాసిక పన్ను విలువ, వాహనం వయస్సు 10 నుంచి 12 ఏళ్లు దాటితే రెండు త్రైమాసికాల పన్ను విలువ పెంచేసింది. వాహనాలపై భారీగా పన్నుల భారం పడింది. దీంతో వాహన దారులంతా ఆందోళన చేపట్టారు. ఎన్నికల సమయంలో హరిత పన్ను దోపిడీ గురించి తెలుసుకున్న చంద్రబాబు ఈ ఏడాది మేలో రవాణా, రవాణాయేతర వాహనాలపై హరిత పన్ను తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆటో కార్మికులపై భారీగా పన్ను భారం తగ్గింది.

ఆర్థిక భరోసా

ఆటో కార్మికులకు రూ.15వేల సాయం ఆర్థిక భరోసా కలిగించనుంది. వైసీపీ పాలనలో ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా రూ.10వేలు సాయాన్ని అందించారు. అయితే నిబంధనల పేరిట లబ్ధిదారులను సంఖ్య బాగా తగ్గించేశారు. రకరకాల జరిమానాలు విధించి ఆ చేత్తే ఇచ్చి ఈ చేత్తే లాగేసుకున్నారు

- డేరంగుల వీరనారప్ప, ఆటో డ్రైవర్, ముదిగుబ్బ

ఎంతో మేలు



ఆటో మిత్ర పథకం ప్రకటించిన సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో రోజు వారి ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య 20 నుంచి 30శాతం తగ్గింది. .అయితే సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు రూ.15వేలు ఇస్తామని ప్రకటించడం ఎంతో సంతోషం కలిగిస్తోంది. జరిమానాల జీఓ 21 రద్దు, సాధికారిత బోర్డు ఏర్పాటు, ఇంధన ధరలు తగ్గింపు వంటి ఎన్నికల హామీల అమలు చేస్తే మరింత మేలు కలుగుతుంది.

- వలి, ఆటో డ్రైవర్, కదిరిగేటు, ధర్మవరం

ఉపశమనం



ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయడంతో ఆటోలకు ప్రయాణికుల సందడి తగ్గింది. దీంతో కంతులు కూడా కట్టుకోలేకపోతున్నాం. ఇంధన ధరలు పెరగడం, వాహన నిర్వహణ ఖర్చులు ఎక్కువ కావడం వల్ల చాలా మంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం రూ.15వేలు వాహనమిత్ర కింద ఇవ్వడం కొంత మేర ఉపశమనం కల్గిస్తోంది

- శీనప్ప, ఆటో డ్రైవర్, తలమర్ల, కొత్తచెరువు మండలం.

తాకిడి తగ్గింది



ఉచిత బస్సు ప్రయాణం లేనప్పుడు ఆటోలకు ప్రజలు ఎక్కువగా ప్రయాణించేవారు. ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణంతో చాలా మంది మహిళలు ఆటోలు ఎక్కడం లేదు. దీంతో ప్రయాణికుల తాకిడి తగ్గింది. గతంలో రోజుకు రూ.1000 నుంచి రూ.1200వచ్చేది. ప్రస్తుతం రూ.600 నుంచి రూ.800 మాత్రమే వస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం వాహన మిత్ర కింద రూ.15వేలు ఇస్తానని ప్రకటించడం సంతోషకరం.

- బషీర్, ఆటో డ్రైవర్, కొత్తచెరువు

సంతోషంగా ఉంది



గత వైసీపీ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు రూ.10వేలు ఇచ్చేవారు. ఆటో కార్మికుల అకౌంట్లలో రూ.10వేలు జమచేసిన కొన్ని రోజులకే అప్పటి ప్రభుత్వం ఆర్టీఓలను రంగంలోకి దించింది. చలానాలు, రవాణాశాఖ నిబంధనల పేరుతో రకరకాలుగా జరిమానాలు విధించింది. ఈ చేతితో ఇచ్చి ఆ చేతితో లాగేసుకుంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆటోడ్రైవర్ల కష్టాలను తెలుసుకుని రూ.15వేలు ఇస్తానని ప్రకటించడం ఎంతో సంతోషం కలిగిస్తోంది.

- కుళ్లాయప్ప, ఆటో డ్రైవర్, పుట్టపర్తి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

(5వ పేజీ తరువాయి)

పరిధిలోని పీవీకేకే కళాశాల నుంచి బస్సుల్లో బయల్దేరాల్సి ఉంది. ఎంపికైన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పీవీకేకే కళాశాలకు చేరుకున్నారు. వారికి జిల్లా విద్యాశాఖాధికారులు స్వయంగా అల్పాహారం వడ్డించారు. ఇక, బస్సు ఎక్కి బయల్దేరమే తరువాయి. ఇంతలోనే భారీ వర్షాలు వారి ఆశలపై నీళ్లు చల్లాయి. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అమరావతిలో నియామక పత్రాల పంపిణీ సభను వాయిదా వేశారు. ఆ సమాచారాన్ని డీఈఓ ప్రసాద్ బాబు వెల్లడించడంతో ఎంపిక అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు నిరుత్సాహానికి లోనయ్యారు. బస్సుల్లో స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు.

నాలుగు రోజులుగా కుస్తీ

డీఎస్సీ నియామకాల్లో భాగంగా అర్హత అభ్యర్థులను ఎంపిక చేసి, తుది జాబితాను విడుదల చేశారు. ఎంపికైన వారికి సీఎం నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా నియామక పత్రాలు అందించాలని నిర్ణయంతీసుకున్నారు. ఆ మేరకు 19న అమరావతిలో సచివాయలం సమీపాన ప్రత్యేక సభ ఏర్పాటు చేశారు. ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులతోపాటు వారి తరపున కుటుంబ సభ్యులు రావడానికి అవకాశం కల్పించారు. ఆ మేరకు బస్సులను ప్రభుత్వమే ఏర్పాటు చేయించింది. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా ఏర్పాట్లు చేపట్టారు. మొత్తం 755 మంది డీఎస్సీ అభ్యర్థులతో పాటు టీజీటీ, పీజీటీ పోస్టులకు ఎంపికైన వారందరికీ కుటుంబం తరపున మరొకరికి అమరావతికి రావడానికి వీలు కల్పించారు. మొత్తం 45 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను నియమించారు.

ఆనందంగా వస్తే..

డీఎస్సీ ఎంపిక జాబితాలోని అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు విద్యాశాఖ సూచన మేరకు గురువారం ఉదయం 6 గంటలకే ఉరుకులు, పరుగులతో జిల్లాకేంద్రంలోని పీవీకేకే కళాశాల వద్దకు చేరుకున్నారు. అమరావతికి వెళ్లడానికి ఏర్పాటు చేసిన బస్సులు అక్కడకు చేరుకున్నాయి. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అందరికీ అల్పాహారం ఏర్పాటు చేయించారు. విద్యాశాఖాధికారులు.. అభ్యర్థులు, వారి కుటుంసభ్యులతో మాట్లాడుతూ.. డీఈఓ ప్రసాద్ బాబు, డిప్యూటీ డీఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసులు, ఏడీలు శ్రీనివాసులు, మునీర్ తదితరులు అల్పాహారం వడ్డించారు. ఇలా ఆనందంగా అమరావతికి వెళ్లి టీచర్ నియామక పత్రాలు అందుకోవాలని అభ్యర్థులు, ఆ ఆనంద క్షణాలను ఆస్వాదించాలని కుటుంబసభ్యులు ఆశగా ఉన్నారు. వారి ఆశలపై వరుణ దేవుడు నీళ్లు చల్లాడు. తెల్లవారుజాము నుంచి వర్షాలు పడుతుండడం, మరో రెండురోజులు భారీ వానలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అమరావతి సభను వాయిదా వేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆ మేరకు ఉత్తర్వులు రావడంతో డీఈఓ.. అభ్యర్థులకు విషయం తెలిపారు. దీంతో అభ్యర్థులు నిరాశకు లోనయ్యారు. త్వరలో తేదీలు ప్రకటిస్తామన్నారు. దీంతో ఎంపిక అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు.. బస్సుల్లో సొంత ఊళ్లకు వెనుదిరిగారు.



కాబోయే గురువులకు అల్పాహారం వడ్డిస్తున్న విద్యాశాఖ అధికారులు

తొలగిన ఇబ్బందులు



గంగానగర్‌లో ఆర్మీ క్యాంటిన్ నిర్వహించిన చిన్నపాటి భవంతి (ఫైల్)

● సరుకుల కొనుగోలులో సైనికుల కష్టాలకు చెక్

● విశాలవంతమైన భవంతిలోకి ఆర్మీ క్యాంటిన్

● భారీగా స్టాకు, కోరిన వస్తువులు అందుబాటులోకి

● పక్క జిల్లాల నుంచి సైతం వస్తున్న సైనిక కుటుంబాలు

● లక్షల నుంచి రూ.కోటి దాటిన క్యాంటిన్ ఆదాయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకుల కొనుగోలులో సైనికులు, మాజీ సైనికుల కుటుంబీకుల ఇబ్బందులకు తెరపడింది. నగరంలోని గంగానగర్‌లో ఉన్న ఆర్మీ క్యాంటిన్ భవనం చిన్నది కావడంతో ఇన్నాళ్లు గంటల తరబడి క్యూలో నిలబడినా తమకు నచ్చిన వస్తువులు కొనుగోలు చేయలేక ఉసూరుమంటూ వెనుదిరిగేవారు. ప్రస్తుతం ఆ కష్టాలకు చెక్ పడింది. నగర శివారులోని ఆర్డీటీ స్టేడియం ఎదురుగా సువిశాలమైన భవంతిలో ఆర్మీ క్యాంటిన్ ఏర్పాటు చేశారు. అలాగే క్యాంటిన్‌కు వచ్చిన సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులకు ఇబ్బందులు కలగకుండా సీటింగ్, పార్కింగ్ వసతులను ఏర్పాటు చేశారు.

ఒకేసారి రెండు నెలల గ్రోసరీ, లిక్కర్...

గతంలో గంగానగర్‌లో ఉన్న చిన్నపాటి భవంతిలో సరుకులు, లిక్కర్‌ను ఏర్పాటు చేసుకునే వెసులుబాటు లేకపోవడంతో స్టాకు తక్కువగా ఉండేది. అప్పట్లో నెలంతా కలిపినా 950 మందికి మాత్రమే కొనుగోలు చేసే అవకాశం ఉండేది. దీంతో చాలా సైనిక కుటుంబాలకు మద్యం, సరుకులు లభించేవి కావు. పెద్ద పెద్ద ఎలక్ట్రానిక్ వస్తువులు(ల్యాడర్, చిమ్నీలు, వాటర్ ఫిల్టర్, మిక్సీలు తదితర) నిల్వ చేసుకునే వీలు లేకపోవడంతో పరిమితికి లోబడి తెప్పించేవారు. ఈ నేపథ్యంలో చాలామంది బెంగళూరు, బళ్లారి వంటి ఆర్మీ క్యాంటిన్లకు వెళ్లి తమకు నచ్చిన వస్తువులు తెచ్చుకునేవారు. క్యాంటిన్ ఆదాయం కూడా అప్పట్లో రూ.42 లక్షలు నుంచి రూ.50 లక్షలలోపే ఉండేది. ప్రస్తుతం మూడు ఫ్లోర్లలో భవంతి ఉండటంతో ఒక ఫ్లోర్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు సరుకులు, మరో ఫ్లోర్‌లో తినుబండారాలు, మరో ఫ్లోర్‌లో లిక్కర్ భారీ స్థాయిలో ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం రోజుకు 2 వేల మందికిపైగా సైనికులు క్యాంటిన్‌లో సేవలు వినియోగించుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒక కార్డుదారుడికి రెండునెలల సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించడం ఆయా వర్గాల్లో ఆనందం నింపుతోంది. కొత్త భవనంలో క్యాంటిన్ ఏర్పా టు చేసిన తర్వాత నెల ఆదాయం రూ.కోటికిపైగా పెరిగినట్లు అధికారులు తెలిపారు. డీమార్ట్ తరహాలో క్యాంటిన్ ఉండటంతో కడప, పులివెందుల, వేంపల్లి, కర్నూలు, డోన్, వెల్దుర్తి, నంద్యాల ప్రాంతాల మాజీ సైనికులు, సైనికులు ఇక్కడికి వచ్చి సరుకులు కొనుగోలు చేస్తున్నారు.



క్యాంటిన్‌లో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులు

అక్రమాలకు చెక్

గంగానగర్‌లో క్యాంటిన్ చిన్నది కావడం, సరైన స్టాకు తెప్పించకపోవడంతో ఇబ్బందులు పడేవారు. అప్పట్లో కొందరు అధికారులు కొందరు మాజీ సైనికులకు సహకారం అందించడంతో సరుకులు, మద్యం పక్కదారి పట్టాయనే ఆరోపణలు వినిపించాయి. ఒక్కో మాజీ సైనికుడు నాలుగైదు కార్డులను తీసుకొచ్చి భారీ స్థాయిలో లిక్కర్ కొనుగోలు చేసి బయటి మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకున్నారన్న విమర్శలు వినిపించాయి. కొత్త క్యాంటిన్‌లో సరుకులు కొనాలంటే ఎవరి కార్డు వారే తీసుకురావాలనే నిబంధనను మేనేజర్ మారుతీప్రసాద్ విధించారు. దీంతో గతంలోలా అక్రమాలకు పాల్పడే అవకాశం లేకుండాపోయింది.



ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఏర్పాటు చేసిన ఆర్మీ క్యాంటిన్

సక్రమంగా సర్వీస్



సబ్ ఏరియా అధికారుల సహకారంతోనే ఆర్డీటీ స్టేడియం వద్ద ఆర్మీ క్యాంటిన్ ఏర్పాటైంది. గంగానగర్‌లో ఉన్న క్యాంటిన్‌లో రోజుకు 80 నుంచి 90 మంది సైనికులకు మాత్రమే సర్వీస్ చేసేవాళ్లం. ప్రస్తుత క్యాంటిన్‌లో రోజుకు 300 నుంచి 400 మందికి సర్వీస్ ఇవ్వగలుగుతున్నాం. పాత క్యాంటిన్‌లో కొందరు మాజీ సైనికులు నాలుగైదు కార్డులు తీసుకొచ్చి భారీస్థాయిలో లిక్కర్‌ను కొనుగోలు చేసేవారు. దీంతో చాలా మంది సైనికులు లిక్కర్, గ్రోసరీ అందక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం క్యాంటిన్‌లో అలాంటి వాటికి చెక్ పెట్టాం. ఒక్క సైనికుడు ఒక్క కార్డుతోనే వస్తున్నారు. అందరికి సకాలంలో సేవలు అందడంతో పాటు.. ఒక్కొక్కరికి రెండు నెలలకు సంబంధించి గ్రోసరీ, లిక్కర్ తీసుకునే వెసులుబాటు కల్పించాం. దీంతో క్యాంటిన్ ఆదాయంతో పెరగడంతో పాటు పక్కజిల్లాల సైనికులకు సైతం సేవలందించగలుగుతున్నాం.

- మారుతీప్రసాద్, మేనేజర్, ఆర్మీ క్యాంటిన్, అనంతపురం జిల్లా

ప్రజారోగ్యానికి పెద్దపీట: సత్యకుమార్



అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ గురువారం అసెంబ్లీలో వెల్లడించారు. వైద్యఆరోగ్యశాఖపై జరిగిన చర్చలో మంత్రి పలు విషయాలు శాసనసభ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 100కు పైగా పీహెచ్‌సీలు మంజూరు చేశామన్నారు. 2021-22లో వీటి నిర్మాణాలకు జీఓలు, పాలనాపరమైన అనుమతులు మంజూరు చేశారే కానీ నిధులు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం వివిధ రాష్ట్ర, కేంద్ర పథకాల ద్వారా వీటి నిర్మాణానికి రూ.194 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 46 పీహెచ్‌సీలను ఆర్‌అండ్‌బీ, 56 పీహెచ్‌సీలను ఏపీఎంఐడీసీ కింద నిర్మిస్తామన్నారు. పీహెచ్‌సీలలో చాలా ఖాళీలను భర్తీ చేశామని, ఇంకా కొన్ని చేయాల్సి ఉందన్నారు. వైద్యశాఖలో వివిధ విభాగాల్లో 2600 ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామన్నారు. 62 ల్యాబ్ టెస్టులు, 172 రకాల మందులను ఆస్పత్రులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మందులు, ఇతరత్ర సర్జికల్స్‌కు ఏటా ఒక్కో పీహెచ్‌సీలో రూ.11,71,560 ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆర్డీటీ కోసం చొరవ చూపండి: సింధూర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏని పునరుద్ధరించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీ వేదికగా కోరారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా తొలిరోజు గురువారం ఆమె ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ పేదల పాలిట కల్పవృక్షంగా వెలుగొందుతోందన్నారు. కులమతాల కు అతీతంగా పేదల సంక్షేమానికి పని చేస్తోంద న్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని 3891 గ్రామాల్లో సుమారు 4.5లక్షల కుటుంబాలకు వివిధ సేవలందిస్తోందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇళ్లు, వ్యవసాయ పరికరాలు ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. భూగర్భ జలాల పెంపునకు చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆర్డీటీ ఆస్పత్రుల ద్వారా లక్షల మందికి ఉచిత వైద్య సౌకర్యాలు అందించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతకు క్రీడారంగంలో ఉచిత శిక్షణ ఇస్తూ, వారిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేస్తోందన్నారు. గ్రామీణ పేదల అభివృద్ధి కోసం శ్రమిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించేలా కేంద్రాన్ని ఒప్పించాలని ముఖ్యమంత్రికి విన్నవించారు.

ఆర్డీటీ పరిరక్షణకు ప్రజా ఉద్యమం: అనంత



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమం చేపడతామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో ఏటా రూ.8.5లక్షల మందికి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఆర్డీటీకి మతం బూచి చూపి దేశం నుంచి వెళ్లిపోయేలా చేస్తున్నారన్నారు. విదేశీ నిధులు రాకుండా అడ్డుకుని ఆర్డీటీ సేవలు అందించలేని స్థితికి తెస్తున్నారని మండిపడ్డారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ కోసం ప్రజా, దళిత సంఘాలు, రాజకీయ పార్టీలు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. సీఎం చంద్రబాబుకు సొంత ప్రయోజనాలు తప్పితే ఆర్డీటీ విషయం పట్టడం లేదా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. ప్రభుత్వాలు దిగిరాకపోతే అందరినీ కలుపుకుని ప్రజా ఉద్యమం నిర్మించి ప్రభుత్వ మెడలు వంచుతామన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గమైందన్నారు. తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు.

మద్యం మత్తులో గొడవ.. హత్య

ఇంటిని అమ్మేందుకు యత్నం.. హతమార్చిన భార్య, కుమారుడు



బెస్త సుధాకర్(ఫైల్)

పామిడి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఇంటిని విక్రయించేందుకు యత్నిస్తున్న బెస్త సుధాకర్(45)ను అతడి భార్య, మైనర్ కుమారుడు హతమార్చిన ఘటన బుధవారం పామిడిలో జరిగింది. పోలీసుల తెలిపిన మేరకు.. పట్టణంలోని బెస్తవీధిలో నివాసం ఉంటున్న లారీ డ్రైవర్ బెస్త సుధాకర్(45)కు ఉరవకొండకు చెందిన మీనాక్షితో 20 ఏళ్ల కిందట వివాహం జరిగింది. ఇటీవల సుధాకర్ మద్యానికి బానిసై, ఇంటిని విక్రయించేందుకు యత్నించాడు. దీనిపై భార్య మీనాక్షితో తరచూ గొడవలు జరిగేవి. ఈనేపథ్యంలోనే బుధవారం రాత్రి మద్యం సేవించిన సుధాకర్ తన భార్య మీనాక్షి, మైనర్ కుమారుడితో వాగ్వాదానికి దిగాడు. గొడవ పెద్దదై ఘర్షణకు దారితీసింది. ఆవేశంతో భార్య మీనాక్షి, కుమారుడు రోకలిబండతో సుధాకర్ తలపై కొట్టారు. తీవ్ర రక్తస్రావం కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడితోపాటు ఓ కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి బెస్త నడిపి సుంకన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఓపికకు పరీక్ష

- వైద్య పరీక్షల కోసం గంటలు, రోజుల వెయిటింగ్
- అల్ట్రా సౌండ్, ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్‌లకు క్యూ
- స్కానింగ్‌కు తేదీలు నిర్ణయిస్తున్న వైద్య సిబ్బంది
- తిరగలేకపోతున్నామంటున్న బాధితులు
- జిల్లా సర్వజనాస్పత్రిని వేధిస్తున్న యంత్రాలు, సిబ్బంది కొరత

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చే రోగులు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే గంటలు కాదు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. స్కానింగ్ కేంద్రాలకు బాధితులు అధిక సంఖ్యలో వస్తుండటంతో ఫలానా రోజు రావాలని తేదీలను నిర్ణయిస్తున్నారు. దీంతో జబ్బుతో ఇబ్బంది పడుతూ, వైద్య పరీక్షలు చేయించుకోవడానికి తమ వంతు ఎప్పుడు వస్తుందా అని బాధితులు ఎదురుచూస్తున్నారు.

ముగ్గురే దిక్కు

పెద్దాస్పత్రిలోని రేడియాలజీ విభాగంలో ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రమే ఉన్నారు. ఇందులో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వేశారు. నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నిబంధనల మేరకు.. రేడియాలజీ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నలుగురు ఎస్ఆర్‌లు ఉండాలి. మొత్తం 13మందికి గాను ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి.

ఆరు అల్ట్రాసౌండ్, ఒకటి చొప్పున సీటీ, ఎంఆర్ఐ

నిత్యం వందలాది మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆరు అల్ట్రా సౌండ్, ఒక సీటీ స్కానింగ్, ఒక ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాలున్నాయి. ఒకరికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయాలంటే కనీసం 10నుంచి 15 నిమిషాలు పడుతుంది. అదే సీటీ స్కానింగ్‌కు 20నుంచి 30నిమిషాలు, ఎంఆర్ఐ స్కానింగ్‌కు 30నుంచి 45నిమిషాల సమయం పడుతుంది. ఈ లెక్కన ఆస్పత్రిలో ఉన్న యంత్ర పరికరాలు, వైద్య సిబ్బందితో రోజు వందల సంఖ్యలో వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడం కష్టంగా మారింది. అయినా నిత్యం 200మందికిపైగా రోగులకు స్కానింగ్ చేస్తున్నామని రేడియాలజీ విభాగం వర్గాలు పేర్కొంటున్నారు.



ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్ల వద్ద పడిగాపులు

ఓవర్‌లోడ్ అవుతోంది



రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌పై ఓవర్‌లోడ్ పడుతోంది. రోజులో 200 నుంచి 400మంది వరకు రోగులను పరీక్షిస్తున్నారు. అయినా తాకిడి తగ్గటంలేదు. అందరికీ స్కానింగ్‌లు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తాం. తగిన సంఖ్యలో సిబ్బంది లేకపోవడం సమస్యకు దారితీస్తోంది. సూపరింటెండెంట్‌గా నేను కొత్తగా బాధ్యతలు చేపట్టా. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా.

-డాక్టర్ సుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల.

తిరగలేకపోతున్నాం..



గైనిక్ ప్రాబ్లమ్‌తో పెద్దాస్పత్రిలోని ఓపీ నెంబర్ 6లో చూపించుకున్నా. పరీక్షించిన డాక్టర్లు రక్త పరీక్షలు, స్కానింగ్‌లు రాశారు. రక్త పరీక్షల కోసం ల్యాబ్‌లో రక్తాన్ని సేకరించి, ఆ సిరంజిని నాచేతుల్లోనే పెట్టారు. అక్కడ, ఇక్కడ ఇవ్వాలని చివరికి ఎవరూ రక్తాన్ని తీసుకోలేదు. రక్తాన్నిసేకరించిన సిరంజ్‌ను రెండు రోజులుగా నా బ్యాగులో వేసుకుని తిరుగుతున్నా. అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రంలోనూ అదే పరిస్థితి. నిరీక్షించలేక కింద పడిపోవాల్సి వస్తోంది.

- మనీష, సిద్ధరాంపురం, బుక్కపట్నం మండలం.



అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రం వద్ద బాధితుల క్యూ

ప్రాణాలు పోయేట్లున్నాయి



పెద్దాస్పత్రిలో స్కానింగ్ చేయించుకునేలోపు ఉన్న ప్రాణాలు పోయేట్లున్నాయి. మా అమ్మ నారాయణమ్మకు బాగలేకపోవడంతో డాక్టర్లకు చూపించాం. అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకు రావాలని చెప్పారు. ఇక్కడ ఇసుకవేస్తే రాలనంత జనం ఉన్నారు. మావంతు వచ్చేలోపు ప్రాణాలు ఉంటాయో, పోతాయో..!

- జ్యోతి, కొత్తచెరువు.

కడుపునొప్పి ఎక్కువ అవుతోంది



కడుపునొప్పితో పెద్దాసుపత్రికి వచ్చా. పరీక్షలు, స్కానింగ్ లేనిదే డాక్టర్లు మందులు రాయడంలేదు. స్కానింగ్ కేంద్రంలో రేపు, మాపు అంటూ తేదీలు ఇస్తున్నారు. వందలాదిమంది బాధితులు స్కానింగ్ కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. కడుపునొప్పి ఎక్కువ అవుతున్నా భరించాల్సి వస్తోంది.

- దివ్య, అనంతపురం.

సీటీ స్కానింగ్‌కు రెండు రోజులు



మానాన్న వన్నూరప్పకు బాగలేకపోతే పెద్దాస్పత్రిలో అడ్మిట్ చేశాం. వారం రోజులు తరువాత డిశ్చార్జ్ చేసి పొమ్మన్నారు. జబ్బు తగ్గకపోవడంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్తే సీటీ స్కానింగ్ రాసిచ్చారు. అక్కడినుంచి రావాలంటే సమస్య తప్పదు. స్కానింగ్ కేంద్రంలో ఎక్కువమంది ఉండటంతో రెండు రోజులు పట్టింది.

- మారెన్న, ఉడేగోళం.

రాహుల్ పోరాటానికి మద్దతుగా నిలవాలి

- డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఉరవకొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా అవకతవకలపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి కోరారు. ఓట్ చోర్ గద్దిఛోడ్ అనే నినాదంతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమంలో భాగంగా పట్టణంలోని క్లాక్‌టవర్ కూడలిలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల 15 వరకూ ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇస్తూ, ప్రజల ఓట్లను దోచుకుని మూడోసారి గద్దెనెక్కిందన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే ప్రతిపక్షాలపైన సీబీఐ, ఈడీలతో దాడి చేయిస్తూ, బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. పలురాష్ట్రాల ఎన్నికల్లో ఈవీఎంలలో స్కాం జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్బాస్, శ్రీన, బ్యాళ్ల ప్రసాద్, నబీరసూల్, యోగానంద రెడ్డి, సుధాకర్, ఆలం నవాజ్, బొజ్జప్ప పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణ.. అన్నిశాఖల బాధ్యత

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పిల్లలపై ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో జరిగే లైంగిక దాడి, వేధింపుల నుంచి సంరక్షించడం అన్నిశాఖల బాధ్యత అని, జిల్లాన్యాయసేవ అధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాసదన్ హాల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలుశాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో పిల్లలపై జరిగే లైంగిక దాడి, వేధింపులు, వాటి నుంచి పిల్లలను కాపాడే చట్టాలు, పాలసీలు, వివిధ శాఖలు మధ్య ఉండాల్సిన సమన్వయంపై అధికారులు చర్చించారు. తర్వాత రాజశేఖర్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ విభాగాలు కలిసి పనిచేయాలన్నారు. హాస్టళ్లలోని బాలికల భద్రతపై తరచూ ఆరా తియ్యడంతోపాటు, కౌమార దశలో ఉండే పిల్లలకు ఆన్‌లైన్, డిజిటల్ భద్రత గురించి, ఇంటర్నెట్ వినియోగం గురించి తెలియజేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమవంతు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐఎఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండప్ప, హ్యాండ్స్ డైరెక్టర్ నారాయణస్వామి, ఇతర అధికారులు శ్రీదేవి, శ్రీనివాసరావు, సీఐ వెంకటేశ్వర్లు, పలు అధికారులు పాల్గొన్నారు.

రేపు క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. అనివార్య కారణాలతో ఈనెల 17న నిర్వహించాల్సిన క్రీడా పోటీలు వాయిదా వేశామన్నారు. వాయిదా వేసిన ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలను ఈనెల 20న అండర్-19 అథ్లెటిక్స్ బాల, బాలికలకు ఆర్ట్స్ కాలేజీలో నిర్వహిస్తామ న్నారు. అదే రోజు బాక్సింగ్, జిమ్నాస్టిక్, వెయిట్‌లిఫ్టింగ్ అండర్-14, 17, 19 విభాగాల్లో బాల, బాలికలకు అశోక్ నగర్‌లోని డీఎస్ ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. సాఫ్ట్‌టెన్నిస్ అండర్-14, 17, 19 బాల, బాలికల విభాగాల్లో క్రీడాపోటీలు నారాయణ టెన్నిస్ అకాడమీలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

రెండు రోజులు పెన్‌డౌన్

బుక్కపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో నూతన విధానాలను వ్యతిరేకిస్తూ రెండు రోజుల పాటు దస్తావేజులేఖరులు పెన్‌డౌన్ ప్రకటించినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆధార్, ఓటీపీ, సాఫ్ట్‌వేర్ వల్ల డాక్యుమెంట్ల తయారీలో తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కొన్నివిధానాల్లో మార్పులు తీసుకురావాలని రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు పెన్‌డౌన్ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సైతం ఆందోళన నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బస్సు ఢీకొని ఒకరి మృతి



ఓబులేసు(ఫైల్)

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిమాలయ లాడ్జి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన ఓబులేసు(59) మృతి చెందగా నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణానికి చెందిన ఓబులేసు, నాగరాజు టీ తాగేందుకు వినాయకసర్కిల్‌కు వెళ్తుండగా బెంగళూరు నుంచి రాయదుర్గానికి వస్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. చికిత్స పొందుతూ ఓబులేసు మృతి చెందాడు. నాగరాజు ను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు.

లాటరీ ద్వారా బార్ల కేటాయింపు: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు బార్లకు లాటరీ ద్వారా లైసెన్స్‌లు కేటాయించినట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం లాటరీ ద్వారా బార్ల లైసెన్స్ దారులను ఎంపిక చేశారు. జిల్లాలో ఐదుబార్లకు అనుమతులు రాగా, మూడు బార్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందునాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేదర కులస్థులను ఆదుకోవాలి

- మేదర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు



వృత్తిదారులను సత్కరిస్తున్న మేదర కుల సంఘం నాయకులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మేదర కులస్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎం నాగరాజు డిమాండ్ చేశారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించా రు. కార్యక్రమానికి నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిం చారు. మేదర కులస్థులు వెదురుబొంగులు కొని గంపలు, చాటలు, తడికెలు, విసనకర్రలు, జల్లెడలు, పురిటి ఉయ్యాలలు తయారుచేసి ఊరూరా తిరిగి అమ్ముకుంటూ అర్ధసంచార జీవనం గడుపుతున్నారన్నారు. మారుతున్న కాలానుగుణంగా ప్రజలంతా ప్లాస్టిక్ పరికరాలవైపు మళ్లడంతో బొంగులతో చేసిన పరికరాలను విక్రయించుకోలేక ఇబ్బంది పడుతున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా మూడు రాష్ట్రాలు మినహా మిగిలిన రాష్ట్రాలన్నీ మేదర కులస్థులను ఎస్టీ జాబితాలోకి చేర్చాయన్నారు. ఏపీలోనూ మేదర కులస్థులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు మేదర వృత్తిదారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేదర సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్ర, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, మహేష్, మధు, కులపెద్దలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విష జ్వరంతో విద్యార్థి మృతి



మృతుడు షేక్ మొహమ్మద్ షాహిద్ (ఫైల్)

ముదిగుబ్బ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న షేక్ మొహమ్మద్ షాహిద్(13) వైరల్ ఫీవర్, నిమోనియాతో మృతిచెందినట్లు మండల వైద్యాధికారి రాజేంద్ర తెలిపారు. స్థానిక గేటు కొట్టాలకు చెందిన విద్యార్థి తండ్రి బాబ్జాన్ పంక్చర్‌షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బాలుడికి అనారోగ్యంగా ఉండటంతో కదిరిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఫలితం లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి, అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందినట్లు తెలిపారు.

ఉద్యోగం రాలేదని ఆత్మహత్య



వెంకటేశ్(ఫైల్)

పరిగి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సేవామందిరం చెక్‌పోస్టు సమీపంలో నివాసముంటున్న వెంకటేశ్(37) గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్ఐ బాలరాజు తెలిపిన మేరకు వెంకటేశ్ ఈ ఏడాది టీచర్ ఉద్యోగం కోసం డీఎస్సీ పరీక్షలు రాశాడు. ఉద్యోగం రాకపోవడంతో కుంగిపోయాడు. ఈక్రమంలోనే ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఉన్న ఇటుకలబట్టీ రేకులషెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడాకారుడు కావడంతో పలువురు తోటి క్రీడాకారులు, స్నేహితులు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళా రైతు ఆత్మహత్య



నల్లమ్మ (ఫైల్)

గార్లదిన్నె, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచెర్ల గ్రామంలో మహిళా రైతు బోయ నల్లమ్మ (37) గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు పెనకచెర్లకు చెందిన బోయ చితంబరయ్య తన భార్య నల్లమ్మతో కలిసి తమకున్న 5 ఎకరాల పొలంలో చీనీచెట్లు సాగుచేసుకుని జీవించేవారు. వారికి ఇద్దరు కుమారులు. గత మూడేళ్ల నుంచి పంట దిగుబడి రాలేదు. దీనికి తోడు బోరుబావుల్లో నీరు ఇంకిపోయాయి. దీంతో చీనీచెట్లను కాపాడుకునేందుకు 4 బోర్లు వేశారు. సుమారు రూ.10 లక్షలకు పైగా అప్పులు అయ్యాయి. పంట దిగుబడి రాక వచ్చిన దిగుబడికి గిటుబాటు ధర లేక ఆర్థికంగా దెబ్బతిన్నారు. దీంతో అప్పులు ఎలా తీర్చేదంటూ దంపతులు తరచూ మథనపడేవారు. ఈక్రమంలోనే జీవితంపై విరక్తి చెందిన నల్లమ్మ గురువారం చీనీపంటకు ఉపయోగించే పురుగు మందును తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు మూడు అదనపు స్టాపింగ్‌లు

గుంతకల్లు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లో గుంతకల్లు మీదుగా వెళ్లే రాయలసీమ ఎక్స్‌ప్రెస్ (12793) రైలుకు ఈనెల 20 నుంచి మూడు రైల్వే స్టేషన్లలో స్టాపింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ రైలును సేడం, నవాండి, తాండూరు స్టేషన్లలో ప్రయోగాత్మకంగా ఒక నిమిషం ఆపనున్నట్లు తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (12794)కు ఇదివరకే ఈ స్టేషన్లలో స్టాపింగ్‌ను కల్పించినట్లు వెల్లడించారు.

రైతులకు యూరియా పంపిణీ



ఆత్మకూరులో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

ఆత్మకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు సేవాకేంద్రంలో గురువారం టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, అధికారులు కలిసి యూరియాను రైతులకు అందజేశారు. అనంతరం మండలకన్వీనర్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతు సేవాకేంద్రాల ద్వారా అవసరమైన ప్రతి రైతుకు ప్రభుత్వం యూరియాను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు పారిజాతమ్మ, మాజీవైస్ ఎంపీపీ ప్రతాప్, మండల నాయకులు శ్రీనివాస రెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

● అనంతపురం రూరల్: మండలంలోని రాచానపల్లి రైతు సేవా కేంద్రంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ బుల్లెట్ రఫీ, టీడీపీ నాయకుడు ఎర్రిస్వామి కలిసి రైతులకు సబ్సిడీపై యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుల్లెట్ రఫీ మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సబ్సిడీపై యూరియాను అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శాస్త్రీయంగా కులగణన చేపట్టాలి: సీపీఐ

అనంతపురం విద్య, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): జనగణన నిర్వహిస్తున్నపుడే కులగణనను శాస్త్రీయంగా చేపట్టేలా కేంద్రం చూడాలని సీపీఐ జిల్లాకార్యదర్శి పాళ్యం నారాయణస్వామి డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం సీపీఐ జిల్లా కార్యవర్గసమావేశం జరిగింది. ఇందులో నారాయణస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వ తెలంగాణలో మాదిరిగా కులగణన చేపట్టాలని ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఇందుకోసం ఈనెల 27వతేదీన రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి ఎన్జీఓ హోమ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్‌కు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి మల్లికార్జున, నాయకులు కేశవరెడ్డి, శ్రీరాములు, గోపాల్, లింగమయ్య, రమణయ్య, రాజేష్, సంతోష్, కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన మహిళల జట్టు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకలపల్లి సమీపంలో గల అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ ఇంటర్ యూనివర్సిటీ పురుష, మహిళల కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహించారు. జేఎన్‌టీయూఏ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జట్ల ఎంపిక చేపట్టారు. కార్యక్రమాన్ని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అనంతరాముడు హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం క్రీడా కారుల ఎంపిక చేపట్టారు. జేఎన్‌టీయూఏ పరిధిలోని వివిధ కళాశాల నుంచి మహిళ, పురుష క్రీడాకారులు పాల్గొన్నారు. కళాశాల వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్రనాయుడు. ఫిజికల్ డైరెక్టర్లు మల్లికార్జున, ధనలక్ష్మి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గర్భిణులు నాణ్యమైన పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే తల్లీబిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి సూచించారు. పోషణ మాసోత్సవాలను పురష్కరించుకుని ఐసీడీఎస్ మూడో సెక్టార్‌లో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. చిరుధాన్యాలు, పాలు, గుడ్లు, ఆకుకూరలు, మునగాకు రోజువారి ఆహారంలో భాగం కావాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు తరచూ తీసుకోవాలని సూచించారు. సిబ్బంది కుమారి, సుభాషిణి, శేషమ్మ, దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గద్దె దిగాల్సిందే: కాంగ్రెస్

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీకి పాల్పడిన బీజేపీ గద్దె దిగాల్సిందేనని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక టవర్‌క్లాక్ వద్ద గురువారం వారు 'ఓట్‌చోర్ గద్దెదిగు' పేరుతో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమాన్ని పార్టీ అనంతరం అర్బన్ ఇన్‌చార్జి దాదాగాంధీ ముఖ్యఅతిథి హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్‌ను బీజేపీ గుప్పిట్లో పెట్టుకుని అక్రమ పద్ధతుల్లో ఎన్నికౌతోందన్నారు. బీజేపీ ఓటుచోరీని ఎండగట్టి గద్దెదించేందుకు ప్రజలతో కలిసి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నారని తెలిపారు. అనంతరం ప్లకార్డులను ప్రదర్శించి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు గాజుల వాసు, శర్మాస్‌వలి, జాకీర్ హుస్సేన్, మహమ్మద్ యూసఫ్, షపి, మసాల రవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

అనంతపురంక్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలుతున్న పీడీఎస్ బియ్యాన్ని అనంతపురం వన్‌టౌన్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. బొలెరో వాహనంలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని నిందితుడిని అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. టీవీ టవర్ ప్రాంతంలోని శివ సాయినగర్ 1వ క్రాస్‌లో నివాసం ఉండే మజ్జిగ హరికృష్ణ అనే వ్యక్తి అక్రమంగా బొలేరో వాహనంలో 29 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. హరికృష్ణ అనంతపురం టౌన్, ఇతర ప్రాంతాల్లో బియ్యం తక్కువ ధరకు కొని వాటిని కర్ణాటకలోని పలు ప్రాంతాలకు తరలించి బ్లాక్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడన్నారు. ఈ క్రమంలో గురువారం కూడా తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశామన్నారు. అలాగే బియ్యంను, తరలించే వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రక్తదానంపై అవగాహన పెంపొందించాలి



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రక్తదానంపై యువతలో మరింత అవగాహన పెంపొందించాలని మై భారత్ రాష్ట్ర కోఆర్డినేటర్ బిసాటి భరత్ తెలిపారు. సేవా దివాస్, సేవా పక్వాడలో భాగంగా గురువారం నగరంలో కేంద్ర యువజన క్రీడాశాఖ, మై భారత్, ప్రగతిపథం యూత్ అసోసియేషన్, యోభా ఫౌండేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో రక్తదానం చేసిన మైభారత్ రాష్ట్ర కోఆర్డినేటర్ బిసాటి భరత్ మట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ప్రారంభించిన సేవా దివాస్, సేవా పక్వాడలో భాగం గా అక్టోబరు 2వతేదీ వరకు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రమాదంలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలు నిలిపే అరుదైన అవకాశం కేవలం రక్తదాతలకు మాత్రమే దక్కుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. తర్వాత రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. మై భారత్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం ఇన్‌చార్జి గోవర్ధన్ శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, జయమారుతి, ఎన్‌సీసీ అధికారులు మురళీ, భార్గవి, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీటి ప్రవాహం

● ఇబ్బంది పడుతున్న స్థానికులు, వాహనదారులు



గౌరీ థియేటర్ ఎదురుగా రోడ్డుపై పారుతున్న మురుగునీరు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాలువల్లో పూడిక తీయక మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. నగరంలోని ఐదో డివిజన్ ఖాజానగర్‌లో గౌరీ సినీకాంప్లెక్స్ ఎదురుగా మురుగు కాలు వలు చిన్నవి కావడంతో పాటు పూడిక పేరుకుపోవడంతో ఓ వైపు వర్షం నీరు, మరోవైపు మురుగు నీరు ముందుకు వెళ్లలేక రోడ్డుపైకి చేరుతున్నాయి. దీంతో అటు వేణుగోపాల్ నగర్, ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్లేవారు, ఇటు శ్రీకంఠం సర్కిల్‌కు వెళ్లే పాదచారులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. అంతేగాక మురుగు నీరు రోడ్డు మీదికి రావడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, అలాగే దోమలు, పందులు బెడద అధికమైందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికే సమస్యను నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డు మీదకు రాకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన న్యాయవాదులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న లాయర్లు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన పలువురు న్యాయవాదులు కలెక్టర్ ఆనంద్‌ను కలిశారు. అనంతపురం అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు హనుమన్న, కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హనుమన్న, ఇతర న్యాయవాదులు అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ గురించి కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బాలాజీ నాయక్, ప్రధానకార్యదర్శి కృష్ణప్ప, సభ్యులు పాల్గొన్నారు.

పలువురి శుభాకాంక్షలు

● అనంతపురం ప్రెస్‌క్లబ్: కలెక్టర్ ఆనంద్‌ను ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలిశారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి తోట చెన్నప్ప ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తమ సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. సంఘం నాయకులతో పాటు పలువురు ఉద్యోగులు ఉన్నారు.

●అనంతపురం న్యూటౌన్: కలెక్టర్ ఆనంద్‌ను ఏపీ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య నాయకులు కలెక్టరేట్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్, కార్యవర్గ సభ్యులు అరుణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలి'

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి, నిధులు పక్కదారి పట్టకుండా చూడాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్-2013 లక్ష్యాల మేరకు మొత్తం నిధులను జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఖర్చుపెట్టాలన్నారు. సబ్‌ప్లాన్ నిధులు దారి పట్టకుండా చూడాలన్నారు. జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయింపులు జరిపి మొత్తం ఖర్చు పెట్టాలన్నారు. మిగిలిన నిధులను వచ్చే ఆర్థిక సంవత్సరానికి బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం కేంద్రకమిటీ కోశాధికారి సోమశేఖర్, సభ్యులు సురేష్, సుబ్బన్న, శ్యాం బాబు, సోము తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి: మేయర్



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు పరం చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని నగర మేయర్ మహ్మద్ వసీం డిమాండ్ చేశారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మాజీ సీఎం వైఎస్ జగన్ తన పాలనలో రాష్ట్రానికి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారన్నారు. అయితే వాటిని ప్రైవేటీకరించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వెంటనే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్పొరేటర్లు రహంతుల్లా, శ్రీనివాసులు, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకోవాలి: ఏబీవీపీ

మెడికల్ కాలేజీల్లో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక అశోక్‌నగర్‌లో గల ఏబీవీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాలల్లో పీపీపీ విధానంతో పేద విద్యార్థులకు వైద్యవిద్య అందని ద్రాక్షలా మారుతుందని తెలిపారు. తక్షణమే ఆ విధానాన్ని రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు విజయ్, నగర సంఘటన కార్యదర్శి అంకిరెడ్డి, నాయకులు భూతరాజు, హితేష్, విష్ణు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి



యర్రగుంట్లలో మాట్లాడుతున్న వైద్యుడు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, అప్పుడే కుటుంబ బాగుంటుందని మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిణి జయలక్ష్మి అన్నారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన 'స్వస్త్ నారీ సశక్తిపరివార్ అభియాన్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. అక్టోబరు రెండో తేదీ వరకు శిబిరాలు నిర్వహిస్తామని, ఇందులో ప్రతి మహిళా పాల్గొని వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రమేశ్, కార్తీక్, మల్లికార్జునరెడ్డి, సుదర్శన్‌గుప్తా, సిబ్బంది పాల్గొన్నారు.

● గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో స్వస్త్ నారీ-స్వశక్తి పరివార్ అభియాన్ కింద మహిళలకు వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 18 నుంచి 30 ఏళ్ల వయసు పైబడిన మహిళలకు వివిధ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం మెడికల్ కళాశాల వైద్యుడు రాజేంద్ర బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను తెలియజేసి నిత్యం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి దిలీప్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, సూపర్ వైజర్ గాయత్రి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతులు పూర్తి

● నేడు యథావిధిగా నీటి సరఫరా

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి చేశారు. పీఏబీఆర్ నుంచి నగరానికి నీటి సరఫరా చేసే పైపులైన్ పగిలి నీరు లీకేజీ అవుతుండడాన్ని స్థానిక బళ్లారి బైపాస్‌లో గురువారం గుర్తించిన నగరపాలక సంస్థ ఇంజనీర్లు సుమారు 18 గంటల పాటు శ్రమించి మరమ్మతులు పూర్తి చేశారు. అయితే మరమ్మతుల కోసం తవ్విన భారీ గుంతలోకి ఓ వైపు వర్షం నీరు, మరోవైపు లీకేజీ నీరు చేరడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. ఏఎంసీ ఎస్ఈ రాజశేఖర్, డీఈ నరసింహం, ఇతర ఇంజనీర్లు, కార్మికులు మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరా ట్రయల్ రన్ చేశారు. దీంతో శుక్రవారం యథావిధిగా నగరంలో నీటి సరఫరా అవుతుందని అనంత నగర పాలక కమిషనర్ బాలస్వామి తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

శింగనమల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంతోపాటు తరిమెల, కల్లుమడి గ్రామాల్లో గురువారం అధికారులు, టీడీపీ నాయకులు ఇంటింటా తిరిగి రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ఎర్రితాతయ్య, టీడీపీ నాయకులు మాసూలచంద్రమోహన్, శంకరనాయణ, డీలర్ శివయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

●ఆత్మకూరు: మండలంలోని ముట్టాల గ్రామంలో రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యురాలు పారిజాతమ్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముట్టాల సొసైటి చైర్మన్ లింగన్న, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

రామగిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసేందుకు గాను ఎమ్మెల్యేపరిటాలసునీత ఆదేశాల మేరకు మండలంలోని కుంటిమద్ది గ్రామంలో గురువారం టీడీపీ నాయకులు, అధికారులు స్థల పరిశీలన చేశారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, స్థానిక నాయకులు జయచంద్రనాయుడు, మల్లెల ఆంజనేయులు, కుమార్‌నాయక్, లింగమయ్య, తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ పురుషోత్తం పాల్గొన్నారు.

వాహన మిత్ర కోసం దరఖాస్తులు

శింగనమల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వాహన మిత్ర పథకంలో లబ్ధి పొందడానికి మండలంలోని ఆటోడ్రైవర్లు సచివాలయాల్లో పెద్దసంఖ్యలో దరఖాస్తులు చేస్తున్నారు. వాహన మిత్రస్కీమ్ అర్హత కోసం దరఖాస్తు చేసుకోవడానికి గురువారం చివరిరోజు కావడంతో వారు పెద్ద ఎత్తున సచివాలయాలకు చేరుకుని దరఖాస్తు చేసుకున్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, ఇందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా సూపర్‌వైజర్ రమణ పిలుపునిచ్చారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, రిడ్స్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఐఈసీ ప్రచార సదస్సును నిర్వహించారు. నలంద డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన సదస్సుకు రమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల పట్ల చిన్నచూపు చూడకూడదన్నారు. బాధితులు క్రమం తప్పకుండా ఏఆర్టీ మందులు వినియోగించాలన్నారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణ పోస్టర్లను ఆవిష్కరించారు. రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేశ్

రామగిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆర్‌కొత్తపల్లి గ్రామంలో గల అంగ్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమికపాఠశాలను ధర్మవరం ఆర్డీఓ మహేశ్ గురువారం తనిఖీచేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు, అందిస్తున్న ఆహారం, పరిశుభ్రతను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అనంతరం నసనకోటలో స్వమిత్వ సర్వేను పరిశీలించారు. తర్వాత పీజీఆర్ఎస్ కింద వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను నిర్దీతకాలంలో పరిష్కరించలని తహసీల్దార్ రవికుమార్‌ను ఆదేశించారు.

సూపర్ సిక్స్‌ను మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలి

● సీఐటీయూ నాయకుల డిమాండ్



ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను మున్సిపల్ కార్మికులకు కూడా వర్తింపజేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు మీదుగా టవర్‌క్లాక్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తూజా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీని వెంటనే అమలు చేసి మున్సిపల్ కార్మికులకు బకాయిలతో కలిపి పెంచిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు సూపర్‌సిక్స్ పథకాలు వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈనెల 23వతేదీన చలో విజయవాడ ద్వారా తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు ముత్తురాజు, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళీ, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, సాకే తిరుమలేష్ ఎర్రిస్వామి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ అమ్మవారు

గార్లదిన్నె, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముకుందాపురం గ్రామంలో గల పెద్దమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పెద్దమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేసి 41 రోజులు పూర్తయింది. దీంతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ వారు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

బీజేపీలోకి యువకుల చేరిక

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బీజేపీలోకి పలువురు యువకులు చేరారు. పార్టీ యువమోర్చా జిల్లా నాయకుడు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన యువనాయకుడు అనిల్‌తో పాటు ఆయన మిత్రులు స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం చేరారు. వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోగుల నాగేంద్రబాబు, పార్టీలోకి చేరిన యువత ప్రమోద్, సోమనాథ్, పృథ్వీరాజ్, తిరుమలకొండ పాల్గొన్నారు.

ఆర్డీటీపై ప్రస్తావన హర్షణీయం: ఎమ్మార్పీఎస్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని గురువారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రస్తావించడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నేత బీసీఆర్ దాస్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్డీటీ ఉమ్మడి జిల్లాలో పేదలకు విశేష సేవలందించిందన్నారు. అలాంటి సంస్థకు ఎఫ్‌సీఆర్ఏను నిలిపివేయడం దారుణమన్నారు. పల్లె సింధూరారెడ్డి మాదిరిగానే ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్‌కు స్పందించాలని ఆయన కోరారు.

● అనంతపురం వైద్యం: ఆర్డీటీ సేవలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రస్తావించడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప పేర్కొన్నారు. ఆమె ఆర్డీటీ అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడాన్ని హర్షిస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌ను కలిసి పేద ప్రజలకు ఆర్డీటీ సేవల అవసరాన్ని వివరించినట్లు చెప్పారు. నాయకులు మారుతీ, సంతోష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి'

అనంతపురం విద్య, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ రకాల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని స్టేట్‌ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్‌కుమార్ గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ గడువు 2023జూలై నాటికే ముగిసిపోయిందన్నారు. ఇప్పటికీ 12వ కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడం, ఐఆర్ ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల అశాస్త్రీయ నిర్ణయాలతో టీచర్లు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. వీటన్నింటిపై అసెంబ్లీలో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

'చౌకబారు రాజకీయాలు చేస్తున్న వైసీపీ'

అనంతపురం రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీలో వైసీపీ చౌకబారు రాజకీయం చేస్తోందని టీడీపీ నాయకులు మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం తెలుగురైతు రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణస్వామి, ఆత్మకూరు మండల కన్వీనర్ శ్రీనివాసులు, కాపుకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాముఠాయి వెంకటేష్, నాయకులు తాటిచెర్ల మునిరెడ్డి, గుర్రం మనోహర్‌నాయుడు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుసేవలో ఉందన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని వైసీపీ జీర్ణించుకోలేపోతోందని మండిపడ్డారు. రాప్తాడు నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వం 2023ఏప్రిల్ నుంచి సెప్టెంబరు 19తేదీ వరకు మొత్తంగా 653మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చిందన్నారు. అదే కూటమి ప్రభుత్వం ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 1334మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు ఇచ్చిందని తెలిపారు. వైసీపీ నాయకులు నిజాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేదీ లేదని హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

వాణిజ్య సముదాయంగా వాల్మీకి సర్కిల్

టీడీపీ నాయకుడు దేవినేని అవినాష్



పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకుడు దేవినేని అవినాష్

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక వాల్మీకి సర్కిల్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సొంత నిధులు సుమారు రూ. 50 లక్షలతో ఒక వాణిజ్యసముదాయంగా అభివృద్ధి చేస్తున్నామని టీడీపీ నాయకుడు దేవినేని అవినాష్ తెలిపారు. గురువారం పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద జరుగుతున్న పనులను వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. పనుల్లో ఏ మాత్రం రాజీ పడకుండా, నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఇప్పటికే నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని, ఎమ్మెల్యే అమిలినేని ముందు చూపుతో వాల్మీకి సర్కిల్ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని, పట్టణాన్ని సుందర వనంగా మార్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు.

వైసీపీ నుంచి రక్షణ కల్పించండి



మాట్లాడుతున్న కుమ్మరి నాగరాజు

తాడిపత్రి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): తనకు వైసీపీ నాయకుల నుంచి ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు విజ్ఞప్తి చేస్తున్నాడు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో గురువారం ఆయన మాట్లాడారు. తాను గన్నెవారిపల్లికాలనీలో నివాసముంటూ బస్టాండ్ సమీపంలో చికెన్‌సెంటర్ నిర్వహిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తనను ఆలూరు గ్రామానికి చెందిన రామేశ్వర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి అనేక ఇబ్బందులుపెట్టి దాదాపు రూ.11లక్షలు వసూలు చేశారని, ఈ విషయాన్ని ఎక్కడైనా చెబితే చంపుతామని బెదిరించారని, వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని వాపోయారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం ఉందనే ధైర్యంతో పోలీసు అధికారుల దృష్టికి తన సమస్యను తీసుకెళ్లానన్నారు.

సమస్యలను అసెంబ్లీలో చర్చించాలి



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి.. వాటిని పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బీ మల్లికార్జున డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్మికులతో కలిసి స్థానిక వినాయక కూడలి నుంచి లక్ష్మీబజార్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. లక్ష్మీబజార్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కూటమి ప్రభుత్వమైనా 12వ పీఆర్‌సీని అమలు చేసి పీఆర్సీ ప్రకారంగా మున్సిపల్ కార్మికులందరికీ వేతనాలు ఇవ్వాలని, ఒప్పంద జీఓలను అమ లు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 23న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.

మాజీ సర్పంచ్ మృతి



ఓబులేసు (ఫైల్)

పామిడి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాళ్యం గ్రామానికి చెందిన మాజీ సర్పంచు ఓబులేసు గురువారం అనారోగ్యంతో మరణించారు. ఆయన మృతదేహానికి టీడీపీ మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, ఎన్డీయే కూటమి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

2,396 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,396, ఔట్‌ఫ్లో 2,356 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు గురువారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.708 టీఎంసీలు నీరు ఉందని, ఫేజ్-2కు 2,104 క్యూసెక్కుల నీరు వెళ్తోందని తెలిపారు.

పశువుల వైద్యశిబిరం

యాడికి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనుప్పలపాడు గ్రామంలో పశువుల గర్భకోశ వ్యాధుల వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ వెంకటేష్ మాట్లాడుతూ.. పశువులకు 90శాతం కచ్చితంగా ఆడదూడలు పుట్టే లింగ నిర్ధారిత్యా వీర్యం అందుబాటులో ఉందని తెలిపారు. దీనిని పాడిరైతులు తమ పశువులకు వేయించి.. సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తాడిపత్రి, శింగనమల ఏడీలు డాక్టర్ ఖదీర్‌బాషా, పద్మనాభం, పశువైద్యాధికారులు విజయలక్ష్మి, సుబ్బారెడ్డి, కోనుప్పలపాడు సర్పంచు రామలక్షుమ్మ, పలువురు పాడిరైతులు పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

కుందుర్పి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం కుందుర్పి మండల సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కొలిమిపాళ్యంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కే కృష్ణమూర్తి ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రేవన్న, జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ హనుమంతప్ప, జిల్లా కౌన్సిలర్ జే కృష్ణమూర్తి, గురుస్వామి, మంజునాథ పాల్గొన్నారు.

ధ్వంసమైన వర్షమాపక పరికరం



దెబ్బతిన్న వర్షమాపక పరికరం

కుందుర్పి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వర్షమాపక కొలిచే పరికరం ధ్వంసమైంది. వర్షం కురిసినప్పుడు మండలంలో ఎంత వర్షపాతం నమోదు అయిందనే వివరాలు ఈ యంత్రం ద్వారా గుర్తిస్తారు. అయితే రెండేళ్ల నుంచి ఈ పరికరం ధ్వంసమైనా.. సంబంధిత అధికారులు దాన్ని బాగు చేయలేదు. వర్షాలు కురిసిన రోజు ఉదయం 8 గంటలలోపు వర్షపాత నమోదును ఈ పరికరం ద్వారా గుర్తించి.. ఉన్నతాధికారులకు నివేదిస్తారు. ఆ వర్షపాతం ఆధారంగానే మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించడానికి ఆస్కారం ఉంటుంది. మరి ఈ పరికరం ధ్వంసం కావడంతో వర్షపాతాన్ని అధికారులు ఎలా గుర్తిస్తున్నారో.. వారికే తెలియాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఈ పరికరాన్ని బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

గందరగోళం..!

- స్మార్ట్ కార్డుల పంపిణీపై అధికారుల నిర్లక్ష్యం
- అమలు కాని 'ఇంటి వద్ద' పంపిణీ
- డీలర్ల వద్దకు క్యూ కడుతున్న కార్డుదారులు



స్మార్ట్ రేషన్ కార్డుల కోసం గుమికూడిన కార్డుదారులు ➤

యాడికి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డుల కోసం లబ్ధిదారులు పడిరాని పాట్లు పడుతున్నారు. పనులు మానేసి డీలర్ల వద్ద నిరీక్షిస్తున్నారు. గురువారం యాడికిలోని ఒక చౌకధరల దుకాణం వద్దకు లబ్ధిదారులు పెద్దఎత్తున వచ్చారు. దీంతో స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ గందరగోళంగా మారింది. ఎవరి రేషన్‌కార్డు ఎవరు తీసుకుంటున్నారో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొంది. మరికొందరు డీలర్లు స్మార్ట్ రేషన్‌కార్డులను కుప్పగాపోసి మీ కార్డు మీరే తీసుకొని చెప్పి.. వెళ్లిపోతున్నారు. దీంతో కొందరు ఆకతాయిలు తమది కాని కార్డులను తీసుకెళ్తున్నారు. దీంతో పలు కార్డులు మిస్ అవుతున్నాయని కార్డుదారులు వాపోతున్నారు. ప్రతి లబ్ధిదారుని ఇంటివద్దకు వచ్చి స్మార్ట్‌కార్డు అందజేసి యాక్టివేట్ చేస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నా... క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. సచివాలయ సిబ్బంది ఆ కార్డులను డీలర్లకు అందజేసి.. చేతులు దులిపేసుకున్నారు.

ఇంటివద్దకే స్మార్ట్ కార్డులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఇంటివద్దనే కార్డు ఇస్తున్న తహసీల్దార్

బొమ్మనహాళ్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయాల్సిన సచివాలయ ఉద్యోగులు .. అందరినీ ఒక చోటికి రప్పించి.. కార్డులు పంపిణీ చేశారు. అంతేకాకుండా స్థానిక నాయకులు చేతుల మీదుగా వాటిని పంపిణీ చేస్తుండటంతో మరింత జాప్యం జరిగేది. ఆ సమయంలో ఓటీపీలు రాక కార్డుదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. దీనిపై స్మార్ట్ కార్డుల పేరుతో హంగామా అనే పేరుతో ఆంధ్రజ్యోతి గురువారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనిపై తహసీల్దార్ మునివేలు స్పందించారు. బొమ్మనహాళ్‌లో రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి.. ఆ కార్డులను పంపిణీ చేయించారు. ఇందులో వీఆర్వో యోగేంద్ర, పంచాయతీ కార్యదర్శి కృష్ణ రావు, డీలర్ రమేష్ పాల్గొన్నారు.

క్వారీతో పంట నష్టం

- పొలాన్ని కాపాడాలని రైతు కన్నీరు
- క్వారీ కొండపైకి ఎక్కి ఆత్మహత్యాయత్నం
- సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో వైరల్



విలపిస్తున్న రైతు బొమ్మయ్య

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్వారీలో పేలుళ్లతో ఏర్పడే దుమ్ముధూళి వల్ల తన పొలంలోని పంటలు నాశనం అవుతున్నాయని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని మండలంలోని ముదిగల్లు గ్రామానికి చెందిన రైతు బొమ్మయ్య విలపించాడు. జీవితంపై విరక్తి చెందిన అతను గురువారం తన కూతురు భారతితో కలసి క్వారీలోని కొండపైకి ఎక్కాడు. ' నాకు 20 ఎకరాల పొలముంది. అందులో మొక్కజొన్న, వేరుశనగ సాగు చేస్తున్నా. నా పొలానికి సమీపంలో కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి క్వారీ ఉంది. అందులో తరచూ పేలుళ్లు జరుగుతుండటంతో దాని వల్ల ఏర్పడే దుమ్ముధూళి పూర్తిగా నా పొలంలో పడుతుండటంతో పంటలు నాశనం అవుతున్నాయి. పోలీసులకు, అధికారులకు చానాసార్లు చెప్పినా.. పట్టించుకోలేదు. నాకు అన్యాయం జరుగుతోంది. ఇక నేను బతకలేను. కొండపైనుంచి దూకి ఆత్మహత్య చేసుకొంటున్నా.. ' అంటూ ఓ సెల్ఫీ వీడియాను తన సెల్‌లో తీసి.. సోషల్ మీడియాతో పోస్ట్ చేశాడు. వెంటనే స్థానికులు స్పందించి.. విషయాన్ని కళ్యాణదుర్గం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ వెంటనే స్పందించి బాధితుడితో ఫోన్‌లో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బొమ్మయ్య ఆత్మహత్యాయత్నాన్ని విరమించుకున్నాడు.

డప్పు కళాకారుల ర్యాలీ



అధికారులతో మాట్లాడుతున్న కళాకారులు

తాడిపత్రి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): పలు డిమాండ్ల సాధన కోసం పట్టణంలోని డప్పుకళాకారులు గురువారం ర్యాలీ నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, డప్పుకళాకారుల మండల కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టి... ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. డప్పుకళాకారులకు పింఛన్ కింద రూ.7వేలు ఇవ్వాలని, డప్పు, గజ్జలు, యూనిఫాం అందించాలని, కళాకారులకు మూడుసెంట్ల స్థలం, మూడు ఎకరాల భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఉమాగౌడ్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

జంగంపల్లిలో భారీ వర్షం



జంగంపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ చేరిన నీరు

యల్లనూరు, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. యల్లనూరు, కృష్ణాపురం, జంగంపల్లి, పాతపల్లి, వెన్నపూసపల్లి గ్రామాల్లో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున 5గంటల వరకు వానపడింది. దీంతో వాగు లు, వంకలు ప్రవహించాయి. ఈ వర్షానికి జంగంపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ మూడు అడుగుల లోతు నీరు నిలిచింది.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

గుంతకల్లు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో బయాలజీ, బీకాం, కంప్యూటర్స్ విభాగాల విద్యార్థులు గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఉత్సాహంగా సాగింది. తమ జూనియర్లను కళాశాలలోకి సాదరంగా ఆహ్వానించారు. కళాశాల కరస్పాండెంటు కేసీ హరి మాట్లాడుతూ జూనియర్స్, సీనియర్స్ మధ్య స్నేహపూర్వకమైన వాతావరణం ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కే నటరాజ్, అధ్యాపకులు అమీర్, బుసెట్టి క్రిష్ణయ్య, కృపానంద, సుభాషిణి, టీ వెంకట రమణ, ఖాజావలి, కే రాకేశ్, శివయ్య, వైశాలి, వరలక్ష్మి పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘానికి విరాళం

తాడిపత్రి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): స్థానిక టీచర్స్‌కాలనీలోని పెన్షనర్ల సంఘానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సురేష్ రూ.10 వేలను గురువారం విరాళంగా ఇచ్చారని ఆ సంఘ సభ్యులు తెలిపారు. సంఘం తరపున చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఈ విరాళం అందించినట్లు సురేష్ తెలిపారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు సన్మానం



ఆసియాబాను, తల్లిదండ్రులను సన్మానిస్తున్న సిబ్బంది

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ భౌతికశాస్త్రం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ ఆసియాబాను ఆల్ ఇండియా తలసైనిక్ క్యాంపుకు ఎంపికై ఢిల్లీలో శిక్షణ పూర్తి చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో ఆసియాభాను, ఆమె తల్లిదండ్రులను గురువారం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ స్థాపించిన అతి కొద్ది కాలంలోనే ఢిల్లీస్థాయికి ఆసియాబాను సెలెక్ట్ కావడం గొప్ప విషయమన్నారు. ఆమె ఢిల్లీకి పంపడానికి ఆమె తల్లిదండ్రులు చేసిన కృషి, సహాయ సహకారాలు అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది అస్లాం, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

దళారుల నుంచి రైతులకు విముక్తి

యాడికి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): దళారీ వ్యవస్థ లేకుండా పంటను రైతులే అమ్ముకొనే వెసులుబాటును తమ సంస్థ కల్పిస్తోందని, ఇది చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా.. లాభదాయకంగా ఉంటుందని నాఫెడ్ రీజనల్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని రాయలచెరువులో నాఫెడ్ సభ్యత్వం కలిగిన రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో దేశంలో 10వేల రైతు ఉత్పత్తిసంస్థలు నిర్వహిస్తున్నారని, అందులో యాడికి మండలం ఉందని తెలిపారు. నాఫెడ్ ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు టార్పాలిన్, స్ప్రేయర్స్, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ పొందవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో వెలుగు ఏపీఎం చంద్రశేఖర్, మౌళాలి, రైతులు పాల్గొన్నారు.

రైల్వే సిబ్బందికి వైద్య పరీక్షలు

గుంతకల్లు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ ఉద్యోగులకు స్వచ్ఛోత్సవ్ కార్యక్రమంలో భాగంగా రైల్వే ఆసుపత్రి వైద్యులు గురువారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లోని ప్రీమియం లాంజ్‌లో పారిశుధ్య సిబ్బందితో పాటు స్టేషన్‌లోని ఉద్యోగులందరికీ వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డివిజనల్ రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, రైల్వే ఆసుపత్రి వైద్యులు ప్రియాంక, మధుసూదన్, సీహెచ్‌ఐ (స్టేషన్) శివన్న, సీహెచ్‌ఐ (కాలనీ) గీతాంజలి, మజ్దూర్ యూనియన్ స్టేషన్ బ్రాంచ్ కార్యదర్శి పీ జాఫర్ ఖాన్, సీపీఎస్‌ఆర్‌లు జీఎం బాషా, ఆర్ ఉషా పాల్గొన్నారు.

జంక్‌ఫుడ్ అనర్థాలపై అవగాహన

కణేకల్లు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చిన్నారులను జంక్‌ఫుడ్స్, నూనె పదార్థాలను పెట్టడం వల్ల కలిగే అనర్థాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ గురువారం అవగాహన కల్పించారు. స్థానిక 10వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహారం ఇవ్వడం వల్ల మానసికంగా, శారీరకంగా అభివృద్ధి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

తాడిపత్రి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని గురువారం లెక్కించినట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు. 2024 నవంబరు 27 నుంచి 2025 సెప్టెంబరు 18 వరకు రూ.6,64,995 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, చవ్వా రంగనాథ్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతి కల్పించండి

కణేకల్లు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, అర్హత ఉన్న వీఆర్‌ఏలను నైట్‌వాచ్‌మెన్, అటెండర్ పోస్టుల్లో నియమించాలని జిల్లా వీఆర్‌ఏ అధ్యక్షుడు పరమేశ్వరప్ప డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు రెండురోజుల సమ్మెలో భాగంగా ఆందోళన చేపట్టారు. వీఆర్‌ఏలకు పే స్కేల్ నమోదు చేయడంతో పాటు నామినిగా పనిచేసేవారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేశులు, లింగప్ప, వన్నూరుస్వామి, శంకర్, లోకేష్ పాల్గొన్నారు.



కణేకల్లులో సమ్మె చేస్తున్న వీఆర్‌ఏలు



మీడియాతో మాట్లాడుతున్న రైతులు

రస్తా విషయంలో వైసీపీ రాజకీయాలు తగదు

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): డీ.హీరేహాళ్ మండలంలోని మురడి గ్రామంలో సుమారు వందమంది రైతులకు సంబంధించిన రస్తా విషయంలో వైసీపీ నాయకులు రాజకీయం చేయడం తగదని టీడీపీ ఎంపీటీసీ సభ్యులు గంగాధర్, వైసీపీ సర్పంచ్ గంగప్ప హితవుపలికారు. గురువారం వారు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద రైతులతో కలిసి మాట్లాడారు. వందేళ్ల నుంచి ఉన్న రస్తాను వైసీపీ ప్రభుత్వం ఉన్నపుడు బంద్ చేయించారన్నారు. ప్రస్తుతం తాము రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా తహసీల్దార్, ఎస్‌ఐలు వచ్చి దారి చూపి.. సమస్యను పరిష్కరించారన్నారు. అయితే వైసీపీకి చెందిన ఈశ్వర్‌రెడ్డి ఆ రస్తాను మరోసారి అడ్డుకుంటున్నారని వాపోయారు. మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి వారికే వత్తాసు పలుకుతూ వందమంది రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తమ గ్రామానికి వచ్చి వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రైతులు అనంతశయన, శివారెడ్డి పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

అదృశ్యమైన బాలిక గుర్తింపు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్‌లో కొలిమి పనుల కోసం వచ్చి ఆగస్టులో అదృశ్యమైన ఓ బాలిక ఆచూకీని పోలీసులు గుర్తించారు. కర్ణాటక రాష్ట్రం మొలకల్మూర్ తాలూకా రాంపురం గ్రామానికి చెందిన ఓ బాలిక తన తల్లిదండ్రులతో కలిసి కొలిమి పనుల కోసం బొమ్మనహాళ్‌కు వచ్చింది. పని ఒత్తిడి తాళలేక తన తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లిపోయింది. దాదాపు నెల రోజులు పాటు కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో గత నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాటిగిలోని తమ మేనమామ ఇంట్లో ఆ బాలిక ఉన్నట్లు గుర్తించి.. ఆ బాలికను తీసుకొచ్చి.. శుక్రవారం ఆమె తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు.

బస్టాండ్‌లో సెల్‌ఫోన్ చోరీ

ఉరవకొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో కూడేరు మండలం నాగిరెడ్డి పల్లికి చెందిన దుర్గప్ప సెల్‌ఫోన్‌ను దుండగులు గురువారం చోరీ చేశారు. తన ప్యాంట్ జేబులో ఉన్న రూ.30వేల విలువ చేసే ఫోన్‌ను ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల బస్టాండ్‌లో సెల్‌ఫోన్ల చోరీలు అధికం కావడంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం సమీపంలో డిగ్రీ కళాశాల వద్ద పది ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు అర్బన్ సీఐ జయనాయక్ గురువారం తెలిపారు. వాటిని తహసీల్దార్‌కు అప్పగించామన్నారు. కాగా, ఒక్కొక్క ట్రాక్టర్‌కి రూ.10 వేలు అపరాధరుసుం విధించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

జీరో బ్రేక్ డౌన్ లక్ష్యంగా పనిచేయాలి

కార్మికులకు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సూచన

గుంతకల్లు/గుత్తి/ఉరవకొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం విజయవంతంగా ముందుకు సాగాలంటే బస్సులకు జీరో బ్రేక్ డౌన్ రికార్డును మెయింటెయిన్ చేయాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు కార్మికులకు సూచించారు. గురువారం గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ ఆర్టీసీ బస్టాండ్లను, డిపోలను ఆయన పరిశీలించారు. గుంతకల్లులో గుమ్మనూరు నారాయణస్వామి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు డీఎంను కలసి ఆర్టీసీ బస్టాండులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, వసతులను కల్పించాలని విన్నవించారు. ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ సిబ్బందికి ఎండీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎండీ వెంట ఆర్టీసీ రాయలసీమ ఛైర్మన్ పూల నాగరాజు, కడప జోన్ ఈడీ చంద్రశేఖర్, ఈడీఈ చంగలరెడ్డి, డీపీటీఓ శ్రీలక్ష్మి, డీఎం గంగాధర్, ఉరవకొండ డిపో మేనేజర్ హంపన్న, డీఎస్పీ శ్రీనివాస్ ఉన్నారు. ఈ కార్యక్రమాల్లో గుంతకల్లు టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, ప్రతాప్ నాయుడు, రామన్న చౌదరి, మత్రునాయక్, గుత్తి టీడీపీ నాయకులు సూర్యప్రతాప్, ఎంకే చౌదరి, శ్రీనివాసులు, రమేశ్, సీపీఐ నాయకులు రాందాసు, వెంకటరాముడు, ఉరవకొండ టీడీపీ నాయకులు, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు రేగాటి నాగరాజు, మారెన్న, మాజీ ఎంపీపీ ప్రతాప్ నాయుడు, గోవిందు, తిమ్మప్ప పాల్గొన్నారు.



గుంతకల్లు సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



ఉరవకొండలో ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎండీ